ప్రజాశక్తి
మంగళవారం 1 ఏప్రిల్ 2025
5
అనంతపురం

అనంతపురంలో ముస్లిములకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

హిందూపురంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిర్మాణం చేసిన టిడ్కో గృహాలు నేటి లబ్దిదారులకు అందలేదు. హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ 2018 జనవరి 10న ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ పనులను ప్రారంభించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా అన్ని పురపాలక సంఘాల్లో టిడ్కో గృహ నిర్మాణ పనులను ప్రారంభించారు. 2019లో టిడిపి ప్రభుత్వం ఓడిపోయి వైసిపి అధికారంలోకి వచ్చింది. వైసిపి ప్రభుత్వం ప్రభుత్వం టిడ్కో గృహాలను ఏ మాత్రం పట్టించుకోలేదు. 2024లో మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చింది. దీంతో లబ్దిదారులకు టిడ్కో గృహాలపై ఆశలు చిగురించాయి. ఈ ప్రభుత్వం అయినా టిడ్కో గృహాలను అందిస్తుందాని ఎదురుచూస్తున్నారు.

కొటిపి వద్ద నిర్మాణ దశలో ఆగిన టిడ్కో గృహాలు

బాలయ్యా.. టిడ్కో గృహాలు చూడయ్యా..!

- ఎన్నికల ముందు ఎమ్మెల్యే బాలకృష్ణ హామీ
- నేటికీ లబ్ధిదారులకు అందని ఇళ్లు
- నెరవేరని పేదల సొంతింటి కల
- ఏడేళ్లుగా తప్పని ఎదురుచూపులు

ప్రజాశక్తి-హిందూపురం

2024 జూలై 14వ తేదీన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హిందూపురం పర్యటనలో భాగంగా పట్టణ సమీపంలో కొటిపి వద్ద ఆగిన టిడ్కో గృహాలను పరిశీలన చేశారు. ఆరు నెలల్లో టిడ్కో గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆ హామీ ఇచ్చి 8 నెలలు అవుతున్నా అందులో ఎలాంటి కదలికా లేదు. దీంతో పేదల సొంతింటి కల నెరవేర లేదు. హిందూపురం పట్టణంలో చాలా మంది పేదలు సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్నారు. హిందూపురంలో మొదటి దశ కింద 2050 ఇళ్లు రెండవ దశ కింద 6500 ఇళ్ల నిర్మాణాలను చేపట్టే విధంగా 2018లో అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందులో 2736 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు పనులు మొదలు పెట్టారు. ఇందులో క్యాటగిరీ వారీగా 300 చదరపు అడుగులు, 1104, 365 చదరపు అడుగులు 1344, 430 చదరపు అడుగుల 288 మొత్తం 2736 మంది డిడిలు చెల్లించారు. ఇందులో 2516 మందికి ఇళ్లను కేటాయించారు.

టిడ్కో గృహాలకు సంబంధించి బ్యాంకు లింకేజీ కింద లబ్ధిదారుల వాట కింద రుణాలను ఇప్పించడానికి మెప్మా వారికి అప్పగించడంతో 380 మందికి వివిధ బ్యాంకుల్లో రుణాలు సైతం వారు ఇప్పించారు. పనులు మాత్రం 2019 సార్వత్రిక ఎన్నికల మందు నుంచి ఆగిపోయాయి. పూర్తి అయిన టిడ్కో గృహాలను జగన్ ప్రభుత్వం ఉచితంగా లబ్ధిదారులకు కేటాయిస్తామని చెప్పడంతో పాటు 2022 జూన్‌లో లబ్ధిదారులకు ఆ ఇళ్లను రిజిస్టర్ చేస్తున్నట్లు చెప్పి రిజిస్టర్ ప్రక్రియ చేపట్టి పూర్తి చేశారు. ఆచరణలో టిడ్కో గృహాల పనులు వైసిపి ప్రభుత్వం చేపట్టలేదు. ఇది చాలదన్నట్లు క్యాటగిరీల వారీగా టిడ్కో గృహాలను సైతం వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. జగనన్న కాలోనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలైన సకాలంలో పూర్తి లబ్ధిదారులకు ఇచ్చారంటే అదీలేదు.

బాలయ్య స్పందించేరా..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే బాలయ్య టిడ్కో గృహాలను సందర్శించారు. ఆరు నెలల్లో పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం అని వాగ్దానం చేశారు. వాగ్దానం చేసి 8 నెలలు పూర్తి అవుతున్నప్పటికీ దాని గురించి బాలయ్య, ఆయన పిఎలు స్పందించడం లేదు. వారి నుంచి స్పందన రాకపోవడంతో టిడ్కో గృహాల కథ కంచికి చేరిందా అన్న సందేహం లబ్ధిదారుల్లో వ్యక్తం అవుతోంది.

ఉమ్మడి జిల్లాలో కేటగిరీల వారీగా రద్దయిన టిడ్కో గహాలు.....

ఉమ్మడి జిల్లాలో టిడ్కో ఆధ్వర్యంలో మొదటి ధశలో నిర్మాణాల్లో ఉన్న ఇళ్లను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. జిల్లాలోని అనంతపురం నగరపాలక సంస్థతో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో చేపట్టిన టిడ్కో ఇళ్లకు సంబంధించి మొత్తంగా 7184 ఇళ్లను రద్దు చేశారు. ప్రధానంగా 300 చదరపు అడుగులు, 365 చదరపు అడుగులు, 430 చదరపు అడుగుల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. ఇందులో ఆ మూడు కేటగిరీల వారీగా పరిశీలిస్తే 300చదరపు అడుగులకు సంబంధించి 1472 ఇళ్లను రద్దు చేయగా, అందులో తాడిపత్రిలో 512, పుట్టపర్తిలో 288, కదిరిలో 96, హిందూపురంలో 384, గుత్తిలో 192 ఇళ్లు ఉన్నాయి. 365 చదరపు అడుగులకు సంబంధించి 3456 ఇళ్లను రద్దు చేయగా అందులో అనంతపురం నగరపాలక సంస్థల పరిధిలో 1008, తాడిపత్రిలో 240, గుంతకల్లులో 144, పుట్టపర్తిలో 288, పామిడిలో 720, కదిరిలో 48, హిందూపురంలో 960, గుత్తిలో 48 ఇళ్లు ఉన్నాయి. 430 చదరపు అడుగుల ఇళ్లకు సంబంధించి మొత్తంగా 2256 ఇళ్లు రద్దు చేయగా అందులో అనంతపురం నగరపాలక సంస్థలో 1056, తాడిపత్రిలో 384, రాయదుర్గంలో 48, గుంతకల్లులో 192, పుట్టపర్తిలో 144, పామిడిలో 144, కదిరిలో 48, హిందూపురంలో 192, గుత్తిలో 48 ఇళ్లను అప్పటి ప్రభుత్వం రద్దు చేయడం జరిగింది. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో టిడ్కో గృహాలపై దృష్టి సారించి నిర్మాణ పనులు పూర్తి చేసి అందజేయాలని లబ్ధిదారుల నుంచి పెద్దఎత్తున డిమాండ్ విన్పిస్తోంది. కూటమి ప్రభుత్వం దీనిపై ఏమాత్రం దృష్టి సారించి పేదల సొంతింటి కల నెరవేరుస్తుందన్నది వేచి చూడాల్సి ఉంది.

టిడ్కో గృహ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న అప్పటి..ఇప్పటి ఎమ్మెల్యే బాలకృష్ణ (ఫైల్ ఫోటో)

2024 ఎన్నికల అనంతరం జూలై 14వ తేదీన టిడ్కో గృహాలను పరిశీలన చేస్తున్న బాలయ్య(ఫైల్ ఫోటో)

రాయదుర్గం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా ఈదుల్ ఫితర్

- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పలువురి శుభాకాంక్షలు

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఈదుల్‌ఫితర్ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం నాడు అన్ని ప్రాంతాల్లోనూ ముస్లిములు పండుగను సంబరంగా జరుపుకున్నారు. రంజాన్ మాసం నెల రోజులపాటు ముస్లిములు చేపట్టిన ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిశాయి. సోమవారం నాడు ఈదుల్ ఫితర్‌ను జరుపుకున్నారు. ఎండలు అధికంగా ఉన్నందున ఉదయం 9 గంటలలోపు ప్రార్థనలు ముగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. అనంతపురం నగరంలోని ఈద్గా మైదానంలో ఉదయం నిర్వహించిన ప్రార్థనల్లో వందలాది మంది ముస్లిములు పాల్గొన్నారు. దీంతోపాటు నగరంలోని ఇతర మసీదులు, ఈద్గా మైదానాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు మౌలానాలు, పెద్దలు పవిత్ర రంజాన్ విశిష్టతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సేవ, సాయం, ధాతృత్వం, ధార్మిక చింతన కలిగి ఉండాలని ఉపదేశం ఇచ్చారు. ఆయా ఈద్గాల వద్ద వివిధ రాజకీయ పార్టీల నాయకులు అక్కడికెళ్లి ప్రార్థనల అనంతరం ముస్లిములకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజాశక్తి -అనంతపురం

కరువు ప్రభావిత మండలాల గుర్తింపు

అనంతలో 6, సత్యసాయిలో 2 మండలాల ప్రకటన

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర వ్యాప్తంగా 6 జిల్లాల్లో 51 కరువు ప్రభావిత మండలాలు గుర్తించామని రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో భాగంగా అనంతపురంలో 6, శ్రీసత్యసాయి జిల్లాలో రెండు కరువు మండలాలను గుర్తించారు. ఇందులో అనంతపురం జిల్లాలో బెళుగుప్ప, గుంతకల్లు, పెద్దవడుగూరు, తాడిపత్రి, యల్లనూరు, యాడికి, శ్రీ సత్యసాయి జిల్లాలో తనకల్లు, రొద్దం మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను పరిశీలించి వర్షపాతం లోటు, పంటల నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిసోడియా తెలిపారు. డ్రౌట్ మేనేజ్మెంట్ మాన్యువల్ ప్రకారం, ఈ మండలాల రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

గుండెపోటుతో జెవివి నాయకుడు శ్రీపతి మృతి

శ్రీపతి(ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జెవివి నాయకుడు శ్రీపతి(35) గుండెపోటుతో సోమవారం ఉదయం అనంతపురంలో మరణించాడు. ఉదయం ఇంట్లో ఉన్న సమయంలో ఆయన అస్వస్థతకు గురికావడంతో వెంటనే మిత్రునితో కలిసి అనంతపురం ప్రజా వైద్యశాలకు చికిత్స నిమిత్తం వెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించేలోపు ఆయన మరణించారు. శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు మండలం పుల్లలరేవు గ్రామానికి చెందిన శ్రీపతి జెవివి నాయకునిగా ఉంటూ అనేక ప్రజా చైతన్య కార్యక్రమాలను నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజా సైన్స్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ప్రముఖపాత్ర పోషించారు. మూఢమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తూ అనేక కార్యక్రమాలు చేశారు. విద్యార్థుల్లో సైన్స్‌పై చైతన్యం చేసేందుకు వందలాది సైన్స్ చెకుముకి టాలెంట్ టెస్ట్‌లను నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శిగా పని చేసి సైన్స్ గొప్పదనాన్ని నిరంతరం ప్రజలకు తెలియజేసేందుకు కృషి చేశారు. ఇటీవల అనంతపురంలో నిర్వహించిన జెవివి రాష్ట్ర మహాసభల విజయవంతంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. ప్రస్తుతం శ్రీపతి కామారుపల్లి గ్రామ సచివాలయ విద్యాకార్యదర్శిగా పని చేస్తున్నారు. శ్రీపతి అంత్యక్రియలను మంగళవారం ఉదయం ఆయన స్వగ్రామంలో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

పలువురి సంతాపం

శ్రీపతి మృతి విషయం తెలుసుకున్న పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, సచివాలయ ఉద్యోగులు సంతాపం తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడ వి.రాంభూపాల్, రాప్తాడు మండల సిపిఎం కార్యదర్శి పోతులయ్య పుల్లలరేవు గ్రామానికి వెళ్లి శ్రీపతి మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

శ్రీపతి పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న వి.రాంభూపాల్, పోతులయ్య

పన్ను వసూళ్లకు సెలవు దినాల్లోనూ ప్రత్యేక కౌంటర్లు

తాడిపత్రి : పురపాలక సంఘం పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నులకు సంబంధించి ఆది, సోమవారాల్లో సుమారు రూ.35 లక్షలు వసూలైనట్లు మున్సిపల్ కమిషనర్ సబ్బి శివ రామకృష్ణ తెలిపారు. సినిమా హాళ్లు, షాపింగ్ మాల్స్, ఆపార్ట్‌మెంట్ల యజమానులు పన్నులు చెల్లించి 50 శాతం వడ్డీ రాయితీని వినియోగించుకున్నారన్నారు. ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి, పురపాలక సంఘం ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి సహాయ, సహకారాలతో పన్నుల వసూళ్లలో జిల్లాలోనే తాడిపత్రి పురపాలక సంఘాన్ని మొదటి స్థానంలో ఉన్నామని తెలిపారు.

ముస్లిములకు మంచినీటిని అందిస్తున్న సిపిఎం నాయకులు

ఈద్గా వద్ద సిపిఎం తాగునీటి సదుపాయం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రంజాన్ పండుగ సందర్భంగా హెచ్ఎల్‌సి కెనాల్ వద్ద ఉన్న ఈద్గా వద్ద సిపిఎం ఇందిరా గాంధీ నగర్ శాఖ ఆధ్వర్యంలో మంచి నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఎండతీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రార్థనల వద్దకు వెళ్లే ముస్లిములకు నీటిని అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న ప్రజలందరూ మతసామరస్యంతో మెలగాలని, అప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందని చెప్పారు. ఇటీవల పాలకులు వారి పరిపాలనా వైఫల్యాలను ప్రజలు గమనించకుండా ఉండేందుకు మతాలు, కులాల మధ్య తగవులు పెడుతున్నారని తెలిపారు. ప్రజలందరూ ఇలాంటి పాలకుల చర్యలను గమనించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, వెంకటనారాయణ, జీవ, ఇందిరాగాంధీ నగర్ శాఖ కార్యదర్శి బోయ ఆంజనేయులు, రాము, మోహన్, రాఘవ, నాగేశ్వరరావు, రమణ, వన్నూరప్ప పాల్గొన్నారు.

ఆశావర్కర్‌కు సిఐటియు పరామర్శ

ప్రజాశక్తి-శింగనమల

ప్రమాదంలో గాయపడిన ఆశా కార్యకర్తను పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది మండల కేంద్రంలోని నివాసానికి చేరుకున్న ఆశావర్కర్ పద్మావతిని సిఐటియు నాయకులు ఆదివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన ఆశావర్కర్ పద్మావతి గతనెల 15వతేదీన వ్యాక్సిన్ క్యారియన్‌ను తీసుకొస్తూ రోడ్డు ప్రమాదానికి గురై బెంగళూరులో చికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్న ఆమెను సిఐటియు నాయకులు పరామర్శించడంతోపాటు ఆశావర్కర్ల యూనియన్ నాయకులు సేకరించిన రూ.30వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జిల్లా అధ్యక్షర, కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు సంబంధం లేని పనులు చేయించకూడదని హెల్త్ కమిషనర్ ఉత్తర్వులు ఉన్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఉత్వర్వులను పాటించకపోవడం వల్లే పద్మావతి ప్రమాదానికి గురైందన్నారు. పద్మావతి ఆరోగ్యం మెరుగయ్యేంత వరకూ ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు. ఆమె తిరిగి విధుల్లోకి వచ్చేంతవరకు ప్రతి నెలా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు రామాంజనేయులు, నాగభూషణ, స్థానిక నాయకులు మురళి, భారతి, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వలయంలో పాపిరెడ్డిపల్లి

- పెద్ద ఎత్తున బలగాల మోహరింపు
- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ గృహనిర్బంధం
- పాపిరెడ్డిపల్లిలో ఎస్పీ పరిశీలన
- రాజకీయం చేసి రాద్ధాంతం చేయొద్దు :
- మంత్రి సవిత, ఎమ్మెల్యే సునీత

పాపిరెడ్డిపల్లిలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి సమీక్ష చేస్తున్న ఇస్తున్న ఎస్పీ వి.రత్న

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామాన్ని పోలీసులు వారి ఆధీనంలోకి తెచ్చుకున్నారు. ఆదివారం రాత్రి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణలో లింగమయ్య అనే వ్యక్తి మరణించాడు. ఈ ఘటన రాజకీయ అంశంగా మారడంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. పెద్ద ఎత్తున పోలీసులు గ్రామంలో మొహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. ఎస్పీ వి.రత్న స్వయంగా గ్రామంలోకి వెళ్లి పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ కలిసి ఎప్పటికప్పుడు పరిస్థితులను ఎస్పీ సమీక్షిస్తూ అక్కడి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. మతుని కుటుంబ సభ్యులతో మాట్లాడి కేసును నిష్పక్షపాతంగా విచారణ చేస్తున్నట్లు తెలియజేశారు. పాపిరెడ్డిపల్లితో పాటు సమీప గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షణ చేశారు. టిడిపి, వైసిపి నాయకులు ఎలాంటి రెచ్చగొట్టే ప్రకటనలూ చేయకుండా సమన్వయం పాటించాలని ఎస్పీ సూచించారు.

మృతుని కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ

రాజకీయ, వ్యక్తిగత కక్షల పేరుతో సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, అరాచక శక్తులను ఉక్కు పాదంతో అణచివేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలియజేశారు. రామగిరి మండలం పాపిరెడ్డి పల్లిలో ఆదివారం జరిగిన వ్యక్తిగత ఘర్షణలో కురుబ లింగమయ్య గాయపడి, అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మతి చెందిన విషయం తెలిసిందే. లింగమయ్య మతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొస్తుండగా మార్గం మధ్యలో మంత్రి సవిత పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లో వ్యక్తిగత ఘర్షణలకు రాజకీయ రంగు పులిమి సమాజంలో అల్లకల్లోలం సష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హత్యలు, దౌర్జన్యాలకు పాల్పడిన వారు ఎంతటివారైనా ఉపేక్షించొద్దని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ వి.రత్నకు మంత్రి ఆదేశించారు. పాపిరెడ్డిపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘటనకు రాజకీయ రంగు పులమడం సరికాదన్నారు.

గోరంట్ల మాధవ్ గృహనిర్బంధం

పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన లింగమయ్య అంత్యక్రియల్లో పాల్గొనేందుకు మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ సోమవారం ఉదయం అనంతపురం నుంచి బయల్దేరారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో గ్రామంలోకి వెళ్తే ఘర్షణ వాతావరణం నెలకొంటుందని, ఈ నేపథ్యంలో వెళ్లేందుకు వీల్లేదని మాధవ్‌కు చెప్పారు. తాను వెళ్లితీరుతానంటూ మాధవ్ చెప్పడంతో పోలీసులు బలవంతంగా ఆయన్ను ఇంట్లో ఉంచి గృహ నిర్బంధం చేశారు.

పాపిరెడ్డిపల్లి ఘటన బాధాకరం
ఎమ్మెల్యే పరిటాల సునీత

పాపిరెడ్డిపల్లిలో జరిగిన ఘటన బాధాకరం అని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణను పరిటాల కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆపాదించడం విచారకరం అన్నారు. ఘటన జరిగిన వెంటనే దీనిపై విచారణ చేపట్టి కారకులను అరెస్టు చేయాలని ఆదేశించామన్నారు. ప్రత్యర్థి పార్టీలు ఇలాంటి ఘటనలను రాజకీయంగా వాడుకోవద్దని ఆమె సూచించారు.

శ్రీహరి ముడి దీక్ష విరమణ

రాయదుర్గం : పట్టణంలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం నుంచి కాలినడకన విప్రకల్లు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకూ శ్రీహరి ముడి దీక్ష విరమణ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తిస్వామి ఆధ్వర్యంలో వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాలినడకన వస్తున్న వారికి వైసిపి నాయకులు మెట్టు విశ్వనాథరెడ్డి, పొరాలు శివకుమార్ వారికి స్వాగతం పలికారు. సిఐ జయానాయక్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న, సభ్యులు సత్యనారాయణ, జివిన్.నరసింహులు, వెంకటేశులు, కమలాక్షుడు, గురునాథ్‌రెడ్డి, రామిరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

మహిళా పోరాటాలకు మోటూరు ఉదయం స్ఫూర్తి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



మోటూరు ఉదయంకు నివాళి అర్పిస్తున్న ఐద్వా మహిళలు

సమాజంలో మహిళలకు సమానత్వం, హక్కుల సాధనకు కోసం మోటూరి ఉదయం నిర్వహించిన పోరాటాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కోశాధికారి చంద్రిక, నాయకులు అశ్విని తెలిపారు. ఐద్వా ఆధ్వర్యంలో మోటూరు ఉదయం 13వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నాడు అనంతపురం సిపిఎం కాలనీలో నిర్వహించారు. మోటూరి ఉదయం చిత్రపటానికి నాయకులు, మహిళలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోటూరు ఉదయం మహిళల కోసం చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సభ్యులు వెంకటలక్ష్మి, గీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

అనంతపురంలో ముస్లిములకు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లావ్యాప్తంగా సోమవారం రంజాన్ వేడుకలను ముస్లిములు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఈ సందర్భంగా ముస్లిములకు ఎమ్మెల్యే దగ్గుపాటి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని డ్రైవర్స్ కాలనీలోని ఈద్గాతోపాటు పలుచోట్ల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా ప్రార్థనల్లో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ గంగారామ్, యువ నాయకుడు సుందర్, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ గౌస్‌మోద్దీన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముస్మిలును ఆప్యాయంగా పలుకరిస్తూ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణ, ధాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పర్వదినం అన్నారు. అర్బన్ నియోజవర్గంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ముస్లిం, మైనార్టీల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, కార్పొరేటర్ జనబలం బాబా, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సైఫుద్దీన్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటప్ప, రాయలసీమ వలి సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్, బెస్త సాధికార కమిటీ రాష్ట్ర నాయకుడు చేపల హరి, టిడిపి నాయకులు నెట్టెం బాలకృష్ణ, ముస్తాక్, జోగి రాజేంద్ర, మైనార్టీ నాయకులు ఇషాక్, మణికంఠ బాబు, మాజీ ఎంపిపి ఇస్మాయిల్, నూర్ మహమ్మద్, చెక్క నాగేంద్ర, టిడిపి నాయకులు, మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు

అనంతపురం రూరల్ : పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని నగరంలోని అశోక్‌నగర్, డ్రైవర్స్ కాలనీల్లో ఉన్న ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రార్థనల్లో పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. భక్తి, శ్రద్ధ, ఉపవాస దీక్షలతో రంజాన్ మాసాన్ని పూర్తి చేసుకున్న ముస్లిం సోదర సోదరీమణులంతా అన్నిరంగాల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రంజాన్ పండుగను అందరూ కలిసిమెలిసి ఆనందంగా జరుపుకోవాలని, నమాజులు చేసి పిల్లలను మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ప్రార్థనలో పాల్గొన్న ముస్లిములకు ఎంపి ప్రత్యేకంగా శీతల పానీయాలను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, ఐఎంఎం బాషా, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ముస్లిముల పవిత్ర పండగ రంజాన్ వేడుకలను సోమవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. గుత్తి, ఆర్ఎస్, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఈద్గాల వద్దకు ముస్లిములు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పామిడి గుత్తి మండలాల టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, గుత్తి పట్టణ కన్వీనర్ ఎంకె. చౌదరి, నాయకులు చికెన్ శీనా, కోనంకి కృష్ణ, హెచ్ఎం. రసూల్, టౌన్ బ్యాంక్ అధ్యక్షులు అబ్దుల్ జిలాన్, వైసిపి నాయకులు ఖాజా మైనుద్దీన్, మహమ్మద్ షఫీలు పట్టణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నార్పల : మండల కేంద్రంలో సోమవారం రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముస్లిములు అందజా స్థానిక జామియా మసీదు నుంచి ఈద్గా మైదానం వరకూ సమూహంగా కలిసి ప్రార్థనలు చేశారు ఈ సందర్భంగా హాజీ ఫయాజ్ బోధనల అనంతరం ఈద్ నమాజ్ చేయించారు. ప్రార్థన అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా మైదానం వద్ద ఎస్ఐ సాగర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దపప్పూరు : మండల కేంద్రంతోపాటు పెద్దయక్కలూరు, వరదాయపల్లి, ముచ్చుకోట, గ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లిములు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

యల్లనూరు : మండల వ్యాప్తంగా రంజాన్ వేడుకలను ముస్లిములు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ఇమామ్‌సాబ్ వలి కట్ట వద్ద ఉన్న దర్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రంజాన్ విశిష్టతను మత పెద్దలు వివరించారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పెద్దవడుగూరు : మండలంలోని పలు గ్రామాల్లో ముస్లిములు సోమవారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దవడుగూరులోని జామియా మసీదు సభ్యులు గ్రామంలోని పురవీధుల గుండా ర్యాలీగా ఈద్గా మైదానానికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీబ రామసుబ్బయ్య, ఎస్సై ఆంజనేయులు పెద్దవడుగూరుతోపాటు చిత్రచేడు, తెలికి, అప్పేచెర్ల, క్రిష్టిపాడు, తదితర గ్రామాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

యాడికి : మండల వ్యాప్తంగా ముస్లిములు రంజాన్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని జామియా మసీదు నుంచి ముస్లిములు అల్లాహు అక్బర్ అంటూ ప్రవచనాలు చదువుకుంటూ ర్యాలీగా బయలుదేరి కోన రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో మత గురువులు మహమ్మద్ ఉమర్ అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా యాడికి సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ ముస్లిములకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు

నార్పలలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

రాయదుర్గం : రంజాన్ సందర్భంగా సోమవారం పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఈద్గా మైదానాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక బళ్లారి రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సైఫుల్లా నేతృత్వంలో నమాజ్ చేశారు. అనంతరం ఖాజీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేశంలో శాంతి, సమృద్ధి, సామరస్యం అభివద్ధి చెందాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలనే ఆకాంక్షతో ప్రార్థనలు నిర్వహించారు. కణేకల్లు రోడ్డు, బిటిపి రోడ్డు వద్ద ఉన్న ఈద్గా మైదానాల్లో పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రధాన రహదారుల వద్ద రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ వేళ భద్రతా పరిరక్షణ చర్యల్లో భాగంగా స్థానిక పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

బొమ్మనహాల్ : దాదాపు నెల రోజుల ఉపవాస దీక్షల అనంతరం నిర్వహించే రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలు సోమవారం బొమ్మనహాల్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరి నొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు ముతవల్లిలు అల్లా సందేశాన్ని, రంజాన్ విశిష్టతను వినిపించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎఎస్ఐ హనుమంతురెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాట్యం చేస్తున్న చిన్నారులు

శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : ఉగాది పండుగలను పురస్కరించుకుని నగర సమీపంలో ఉన్న శిల్పారామం ఆదివారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా రాఘవేంద్ర పంచాంగ శ్రవణం, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ శ్రీ నృత్య కళా నిలయానికి చెందిన కళాకారులు భరత నాట్య నృత్య ప్రదర్శనలు చేసినట్లు శిల్పారామం పరిపాలన అధికారి శివప్రసాద్ రెడ్డి తెలిపారు.

బండలాగుడు పోటీలు

బండను లాగుతున్న ఎద్దులు

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చాగల్లు గ్రామంలో సోమవారం ఎద్దుల పందేలు నిర్వహించారు. గ్రామపెద్దల ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతల ఎద్దుల యజమానులకు బహమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఎద్దుల యజమానులు, సర్పంచు లలిత శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

సరుకులు పంపిణీ చేస్తున్న నిర్మలామురళి

అనంతపురం : ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో అనంతపురంలోని పలు కాలనీల్లో పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దాదాపు రూ. 20 వేల ఖర్చుతో 20 హిందు, ముస్లిం పేద కుటుంబాలకు సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

నివాళులర్పిస్తున్న నాయకులు

నార్పల : మండల పరిధిలోని కేసేపల్లి గ్రామ టిడిపి సీనియర్ కార్యకర్త హనుమంతురెడ్డి మృతికి పలువురు టిడిపి నాయకులు నివాళులర్పించారు. ఇందులో భాగంగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు కేసేపల్లికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. తర్వాత కుమారుడు లోకనాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో పిట్టు రంగారెడ్డి, ఎర్రినాగప్ప, తలారి కుళ్లాయప్ప, నాగేంద్ర, కేశవరెడ్డి, శ్రీరాములు, వెంకటనారాయణ, ఆది, భాస్కర్, నాగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నాగరాజు, ఎర్రినాగప్ప, బుజ్జులు, టిడిపి నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

లక్ష్మీ వెంకటరమణస్వామి కల్యాణం

యాడికి : మండలంలోని కమలపాడు పంచాయతీ పరిధిలోని చింతరాయపల్లి సమీపంలో వెలసిన లక్ష్మీ కొత్త వెంకటరమణస్వామి దేవస్థానంలో స్వామివారికి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పండితులు హరిస్వామి, పవన్ స్వాముల ఆధ్వర్యంలో గంగవరం రవితేజ, రవ్వ మధుసూదన్ దంపతులు ఆసీనులై కళ్యాణం చేశారు. అనంతరం రవ్వ ఫ్యామిలీ ఆధ్వర్యంలో భోజనాలు ఏరఆపటు చేశారు. యాడికి నుంచి కొత్త రాయుడు కొండకు ఉచిత ప్రయాణ సౌకర్యాలు, ప్రసాదం పంపిణీలు, లైటింగ్ సౌకర్యంతోపాటు అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయించారు ఈ కార్యక్రమంలో గంగవరం చంద్రయ్య, శ్రీధర్, శేఖర్, పవన్, రాజా, గుణ, రవ్వ మోహన్, బాల పుల్లయ్య, పుల్లయ్య, రాము, నితిన్, శ్రీహరి, మహేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఎస్సీ, ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు

ఉరవకొండ : పట్టణంలోని శ్రీ గాంధీ హరిజన హాస్టల్‌లో సోమవారం నియోజకవర్గ అంబేద్కర్ ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్, ప్రజా, విద్యార్థి సంఘాల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. జెఎసి కమిటీకి కన్వీనర్‌గా మధుప్రసాద్, కో కన్వీనర్‌గా సాకే.పురుషోత్తం, కార్యవర్గ సభ్యులుగా బి.సాకే రమేష్, పృథ్వీరాజ్, తంబన్న, ట్రెజరర్‌గా భాస్కర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ విద్యార్థి, ఎంప్లాయీస్, ప్రజాసంఘాల నాయకులు గోపాల్, ఆనందరాజు మాట్లాడుతూ ఏప్రిల్ 5 బాబూ జగ్జీవన్‌రామ్, 9 ఫాదర్ విన్సెంట్‌ఫెర్రర్, 11న మహాత్మ జ్యోతిరావు పూలే, 14 డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సంకల్పించి అన్నివర్గాల వారితో కలిసి జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, సోమశేఖర్, గుడిసెల రాజేష్, రాము, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న నాయకులు

నేడు ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి-పుట్లూరు :

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మంగళవారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని నాయకునిపల్లి గ్రామంలో నిర్వహించనున్న పింఛన్ల పంపిణీలో పాల్గొని పింఛన్లు అందజేయనున్నట్లు తెలిపారు. కావున మండల స్థాయి అధికారులు అందరూ హాజరు కావాలని కోరారు.

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానము,
పెన్నహోబిలం గ్రామము, ఉరవకొండ మండలం అనంతపురము జిల్లా.
బహిరంగ ప్రకటన

1) 3x10 అడుగులు వెడల్పు, ఎత్తు గల 10 సిమెంట్ ట్యాంకులు ట్రాన్స్‌ఫోర్టేషన్‌తో సహా సప్లై చేయుట. **2)** దేవస్థానం చుట్టుపక్కల 10 సిమెంట్ ట్యాంకులు నిలబెట్టుటకు 4x4 అడుగులు సిమెంట్ బెడ్డింగ్ వేసి అరగు నిర్మించుటకు సిమెంట్, రాళ్ల వగైరా కలిపి కూలీతో సహా సప్లై చేయుట. **3)** దేవస్థానం ఆవరణంలో ఉన్న మొత్తం 25 మంచినీటి సిమెంట్ ట్యాంకులకు ఐరన్ కొళాయిలు, ప్లాస్టిక్ పైపులు వగైరా సప్లై చేయుట. **4)** 25 మంచినీటి ట్యాంకులు మరియు మూడు పెద్ద ట్యాంకులకు కొత్తగా ఐరన్ కొళాయిలు, ప్లాస్టిక్ పైపులు అమర్చుట తదితర ప్లంబింగ్ పనులు చేయుట. **5)** దేవస్థానం యొక్క రథ చక్రం ఒకటి కొంత భాగం దెబ్బతిన్నందున టేక్ వుడ్ సప్లై చేయుట.

పై తెలిపిన పనులు చేయుటకు ఆసక్తి కలవారు తమ కొటేషన్లను ఈ ప్రకటన వెలువడిన 5 రోజులలోగా పంపవలసినదిగా కోరడమైనది.

ఇట్లు కార్యనిర్వహణాధికారి,

IN THE COURT OF THE ADDL DISTRICT JUDGE ; (M.A.C.T) (FAMILY COURT) ANANTAPUR.
M.V.O.P. No: 245/2019

Between:
1.Dr Sathri Sydanna s/o Late S.Kambanna
2.Dr Indira w/o Dr S.Sydanna
3.Sathri Swetha D/o Dr S.Sydanna
All are residing in D.no 12-5-344 Shivaji Nagar Housing Board Colony Ananthapur**...Petitioners**
And
1. M.Ramanjaneyulu S/o N.Paparayudu Kalluru Village, Garladinne Mandal, Ananthapuramu Dtistrict.
2. J.Mahesh S/o J.Obilesu, D.No.3-87, Pamidi Village, & Mandal, Ananthapuramu Dtistrict.
3.The Divisional Manager United India Insurance Co, Ltd Subhash Road, Meda Mansions, Ananthapur
4.B. Narayana Swamy S/o B.Adinarayana D.No.19-651-A-428, Bhagya Nagar, Ananthapur (Praposed Respondent No:4) **...Respondants**

NOTICE TO THE RESPONDENT No:4
B.Narayana Swamy S/o B.Adinarayana
D.No.19-651-A-428, Bhagya Nagar, Ananthapur
(Owner of the Lorry No APO4 -U-0025)

Please take notice that the Petitioners have filed the above case for claiming compensation against you and others and the same is posted to 17-04-2025 for your appearance and you are directed to appear before this Hon'ble court on 17-04 -2025 at 10-30 A.M., in person or through an advocate without fail, otherwise the matter will be decide set exparte.

Hearing Date ;17-04-2025

(By Order of the Court)
P.RAVINDRANATHA REDDY
Advocate for the petitioners.
Ananthapuramu.Cell No:9441074100.

IN THE COURT OF THE III rd ADDL.JUNIOR CIVIL JUDGE (Excise Court) ANANTHAPURAMU
O.S. No: 1383/2022

Between:
B.Lingamma and another **...Plaintiffs**
And
M.Narayanappa and Others **...Defendants**

Notice to Defendant No:2,3,4,5,and 7
D2: Lingamma, D/o Late Pedda Pothulaiah
D3: Lakshmidevi, D/o Late Pedda Pothulaiah, ,
D4: Narayanamma, D/o Late Pedda Pothulaiah,
D5: Akula Pedda Narasimhudu, S/o Kadirappa,
D7: Velupu Bala Sreelatha, W/o V.Sivananda,
All are Hindus, residents of Obulapuram Village, Narpala Mandal, Anantapuramu District.

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 10-04-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(By Order of the Court)
S.Sudarshan Reddy, Advocate,
Ananthapuram. Cell:83744 75384.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక సిఐటియు కాలనీలో జేమ్స్ స్వచ్ఛంద సంస్థ, సెయింట్ పాల్స్ స్కూల్ యాజమాన్యం సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జేమ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు పాస్టర్ స్టీఫెన్ జోసఫ్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ జోసఫ్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలు దాహం తీర్చే అవకాశం తమకు రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు మాట్లాడుతూ జేమ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు స్టీఫెన్ జోసఫ్ ఎనిమిది ఏళ్లుగా పేదలకు ఎన్నో రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తుండటం సంతోషకరమన్నారు. కరోనా సమయంలో కూడా వందలాది కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, జేమ్స్ స్వచ్ఛంద సంస్థ కమిటీ సభ్యులు శామ్యూల్, సిమెన్స్, సుమన్, ఉదయ్‌కుమార్, హెడ్రిక్ రాజ్‌కుమార్, సిపిఎం పట్టణ నాయకులు అబ్దుల్లా, బాషా, షాషా, ఓబులేసు, సూరి, వీరన్న, రాము, ఖాదర్, కిష్టప్ప, రామయ్య, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

కార్మికుడు మృతిచెంది నాలుగు నెలలైనా పట్టించుకోకపోడం బాధాకరం-రాష్ట్ర పీపుల్ హ్యూమన్ రైట్స్ ప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న అదానీకి చెందిన సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలని రాష్ట్ర పీపుల్ హ్యూమన్ రైట్స్ (పిహెచ్ఆర్‌సి) ప్రతినిధులు డిమాండ్ చేశారు. బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న అదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో 2024వ సంవత్సరం డిసెంబర్ 18వతేదీన కూలర్లలో మరమ్మతులు చేస్తు ఒడగా జరిగిన ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడటం తోపాటు ఒకరు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో గూడూరు షణ్ముకానందరెడ్డి (30) మృతిచెందాడు. ఈనేపథ్యంలో పిహెచ్ఆర్‌సి సభ్యులు సోమవారం అదాని సిమెంట్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని హెచ్ఆర్‌ను మృతుడి కుటుంబానికి న్యాయం చేశారా..? అని వివరణ చేరారు. ఇందుకు హెచ్‌ఆర్ నుంచి కనీస స్పందన లేదనిపిహెచ్ఆర్‌సి సభ్యులు తెలిపారు. మృతుడి కుటుంబీకులను కలిసి వారి కోరిక విజ్ఞప్తి న్యాయ పోరాటం చేస్తామన్నారు. కర్మాగారంలో జరిగిన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పీపుల్ హ్యూమన్ రైట్స్ జనరల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ గుండా నారాయణస్వామి, జిల్లా ప్రెసిడెంట్ విశ్వనాథ్, జిల్లా సెక్రటరీ లింగం చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ కుండా లక్ష్మీనారాయణ, తాడిపత్రి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మార్కె మురళి, సెక్రటరీ చింతా తిరుమలేష్, జాయింట్ సెక్రటరీ మూలింటి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

బసవేశ్వర జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్ర స్వామి అన్నారు. సోమవారం ఉరవకొండలోని వీరశై కళ్యాణ మండలంలో నిర్వహించిన నియోజకవర్గ సంక్షేమ సమాజం కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 శతాబ్ధంలోనే కులమతాలు, స్త్రీ, పురుషులు సమానమేనని చాటి చెప్పిన మహనీయుడు బసవేశ్వరుడు అన్నారు. అలాంటి మహనీయుల జయంతిని ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల్లో ఆయా ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తున్నాయన్నారు. కావున మన రాష్ట్ర ప్రభుత్వం కూడా బసవేశ్వర జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. కాగా ఉగాది పురస్కారాల్లో భాగంగా అనంతపురం కలెక్టర్‌తో పురస్కారం అందుకున్న జెరుట్ల రాంపురం ప్రధాన అర్చకుడు నాగరాజు స్వామిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సంక్షేమ సమాజం నాయకులు చంద్రిక మల్లికార్జున, పాటిల్ నాగన్‌గౌడ్, పాటిల్ నిరంజన్‌గౌడ్, గంగవరం ప్రసాద్, దుద్దేకుంట భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ, బొజ్జప్ప, తత్రగల్లు నాగేంద్ర, టీచర్ లోకేష్, వెలిగొండ గంగాధర్, దేశాయి వీరేష్, మోపిడి చంద్రమౌళి, రాజేష్‌స్వామి, శివస్వామి, తదితరులు పాల్గొన్నారు.



నాగరాజస్వామిని సన్మానిస్తున్న అతిథులు

కామ్రేడ్ రంగన్న ఆశయాలు కొనసాగిస్తాం

ప్రజాశక్తి-ఉరవకొండ

దివంగత కమ్యూనిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్ తమ్మినేని రంగన్న ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు కొనియాడారు. రంగన్న వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన స్వగ్రామం వజ్రకరూరు మండల పరిధిలోని ఛాయాపురంలో ఉన్న స్మారక స్థూపం వద్ద నివాళు లర్పించారు. అనంతరం ఉరవకొండలోని సిపిఐ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కామ్రేడ్ రంగన్న కీలకపాత్ర పోషించారన్నారు. ముఖ్యంగా భూపోరాటంతో పాటు ఇంటి పట్టాలు, సాగు, తాగునీరు వంటి సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటాల్లో రంగన్న ప్రత్యక్షంగా పాల్గొన్నారన్నారు. అలాంటి ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగన్న కుమారుడు రాజశేఖర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, సీనియర్ నాయకులు గెన్నే మల్లేసీ, పురిడీ తిప్పయ్య, హోతూరు శ్రీధర్, చెన్నరాయుడు, చక్రధర్, నిరంజన్‌గౌడ్, ఎఐవైఎఫ్ నాయకులు నవీన్‌బాబు, వేణు, నరేష్, రామ్‌చరణ్, రాకెట్ల అశోక్, ఛాయాపురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రంగన్న స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నేటి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఇంటర్ బోర్డు అధికారులు ఆదేశాలు మేరకు ఏప్రిల్ 1వతేదీ నుంచి 2025-26 ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర తరగతులు ప్రారంభం కానునట్లు కళాశాల ప్రిన్సిపల్ మమత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం నుంచి ఇంటర్‌లో అనేక మార్పులు రాబోతున్నాయన్నారు. ముఖ్యంగా ఎంపిసి గ్రూపు సిలబస్‌లో ప్రశ్నపత్రాల్లో మార్పులు జరిగినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం ఇంటర్ అడ్మిషన్ 7వ తేదీ నుండి ప్రారంభం కానునట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు నేరుగా తరగతులకు హాజరు కావచ్చన్నారు. ఏప్రిల్ 23 వరకూ తరగతులు నిర్వహిస్తామన్నారు. తర్వాత జూన్ 1వతేదీ వరకూ వేసవి సెలవులు ఉంటాయన్నారు. కావున విద్యార్థులందరూ ఏప్రిల్ 23వతేదీ వరకూ తరగతులకు హాజరు కావాలని కోరారు. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంతోపాటు ప్రతి విద్యార్థికీ నోట్ బుక్స్, సైన్స్, ఒకేషనల్ విద్యార్థులకు రికార్డులు, బయోమెట్రిక్ విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా అమ్మవార్లకు బోనాలు

యల్లనూరు : ఉగాది పండుగ పురస్కరించుకుని మండలంలోని కొదవండ్లపల్లి పెద్దమ్మ తల్లి, చిలమకూరు యల్లమ్మ, బాట సుంకులమ్మ అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. ఆదివారం ఉగాది కావడంతో బోనాలు సమర్పించినట్లు ఆలయ అర్చకులు అంటున్నారు.

ఘనంగా ఆంజనేయ స్వామి రథోత్సవం

పూజలందుకున్న ఆంజనేయస్వామి

పెద్దవడుగూరు : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని కోటకొండలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఈశ్వరరెడ్డి సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో హోమం, ఆకుపూజ, తదితర పూజలు చేశారు. సాయంత్రం స్వామి మూలవిరాట్‌ను ఆలయ పరిసరాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లగా ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవానికి చుట్టుపక్కల ప్రజలతోపాటు పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేలా ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పగడాల ప్రవీణ్ మృతికి సంతాపంగా శాంతి ర్యాలీ

ప్రజాశక్తి అనంతపురం

ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

క్రైస్తవ ప్రబోధకుడు పగడాల ప్రవీణ్ మృతికి సంతాపంగా అనంతపురంలోని క్రైస్తవులందరూ సోమవారం నగరంలో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక గాస్పుల్ హాల్ అసెంబ్లీ వద్ద పాస్టర్ వరప్రసాద్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థన చేశారు. అక్కడి నుంచి కొవ్వొత్తులు వెలిగించి శాంతి ర్యాలీని ప్రారంభించారు. క్లాక్ టవర్, సప్తగిరి సర్కిల్ మీదుగా ఎస్ఐయు చర్చి వరకూ మౌన ప్రదర్శన సాగింది. తర్వాత ప్రవీణ్‌కు సంతాపం తెలుపగా సిఎస్ఐ చర్చ్ పాస్టర్ బెన్హర్ బాబు చివరి సందేశాన్ని అందించారు. అనంతరం ఎస్ఐయు చర్చి పాస్టర్ సంపత్ విజయకుమార్ ప్రార్థన ఆశీర్వాదాలతో ర్యాలీ ముగిసింది. ఈ ర్యాలీలో అనంతపురం పాస్టర్ల సంఘాల అధ్యక్షులు నెహెమ్యా నాగరాజు, మోజెస్ అనిల్‌కుమార్, ఐజయ్య, హెర్ మోన్ చర్చి పాస్టర్ ఐజయ్య, పాస్టర్లు రఘునాథ్ డేనియల్, టిడిపి క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, ఎఐసిసి రాష్ట్ర కార్యదర్శి కాంతి జాన్ వెస్లీ, ఎఐసిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరారి విక్టర్ డేనియల్, జిల్లా అధ్యక్షుడు విల్సన్, ఐసిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కమలాకర్‌రావు ఫీబా జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఈద్గా వద్ద బాలుడు అదృశ్యం

గంట వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

ప్రజాశక్తి-గుత్తి

బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

పట్టణంలోని ఈద్గా వద్ద సోమవారం ఓ బాలుడు అదృశ్యమయ్యాడు. అయితే గంట వ్యవధిలో పోలీసులు బాలుడిని వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. తాడిపత్రి మండలం సజ్జలదిన్నెకు చెందిన లాల్ కాశీం అనే ఐదేళ్ల బాలుడు పెద్దవడుగూరు మండలం కాసేపల్లిలో ఉన్న తన మేనమామ కమల్‌బాషా ఇంటికి వచ్చాడు. రంజాన్ పండుగ సందర్భంగా గుత్తి పట్టణంలోని ఈద్గా వద్దకు మామ, అల్లుళ్ల నమాజ్‌కు వెళ్లారు. నమాజ్ అనంతరం బాలుడు అదృశ్యం కావడంతో మేనమామ కమల్ భాషా పోలీసులకి ఫిర్యాదు చేశాడు. దీంతో సిఐ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలో గాలించారు. అనంతపురం రోడ్డులో లాల్ కాశీం ఉండగా చేరదీశారు. తల్లి, మేనమామకు సమాచారం ఇచ్చి ఆ బాలున్ని వారికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్ల జి.హనుమంతు, ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బెలుగుప్ప: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన దుద్దేకుంట గ్రామానికి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రామసాగర్ గ్రామానికి చెందిన బొజ్జప్ప మద్యం తాగి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా దుద్దేకుంట గ్రామం నుంచి అంకంపల్లి గ్రామానికి బోయ శ్రీకాంత్, భార్యతోపాటు మూడేళ్ల కుమారుడు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న మోటార్ ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో అంకంపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, భార్య, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రయివేటు వాహనంలో ఆసుపత్రికి తరలించారు.